లని నవ్వుతూంటే మనం ఏడవాలిసోదరా! అది బాగులేదు అని చెపితే అతను పాపం కాస్త సర్దుకున్నాడు. 1883లో జార్జి బెర్నార్డ్‌షా, హెచ్. జి. వెల్సు, సిడ్నీ వెబ్ ఫాభియన్ సొసైటీ సంస్థాపించారు. యిప్పుడు మనం దానికి సంక్షిప్తంగా పి. బి. సొసైటీ స్థాపిద్దాం అని చమత్కారంగా తప్పుకున్నాడు. నామట్టుకుమాత్రం అఖిలభారత నిరుద్యోగ సంఘం అన్నదాంట్లో ఉన్న గొప్పదనం పి. బి. సొసైటీలో లేదని నమ్మకం. అయినా మనం పోరంబోకులంకాం. పోరంబోకులం కామనే ఆత్మవిశ్వాసం మనలో ప్రతి ఒక్కరిలోనూ ఉండాలి. లేకపోతే ప్రజల అపహాస్యానికి మనం గురికావలసివస్తుంది.

ఇతర పట్టణాల్లోనూ, పల్లెలలోనూ ఉన్నవారు మనం వారికి మార్గదర్శకులమనీ, మనసంఘం బాధ్యతలూ, కర్తవ్యాలూ, తెలియచేయవలసినదనీ, ప్రతిచోటా ఉపసంఘాలు లేవదీస్తామనీ ఎన్నో ఉత్తరాలు యికముందు వస్తాయి. మనం యిక్కడేదోమహాఘనకార్యకలాపాల్ని సృష్టించి ఉపశాఖలకి పింపిణీచేస్తామనే ఆశలు పెట్టుకుని కూర్చుంటారు. మనం వాళ్ళందరికీ ఆదర్శపురుషులము అని భావిస్తూ ఉంటారు. అలాంటిది మనకి హాజరుకావటానికే చాలాకష్టంగా ఉంది. బౌద్ధమతంలాగ యిది పుట్టినచోట లేకుండాపోయి యితరత్రా ప్రాకుతుందేమో. అయినా యిలాటి సంస్థ ప్రప్రథమంలో ఇంగ్లాండులో బయలుదేరి ఉండాలిలెండి. లేకపోతే 1909-12 మధ్య ఇంగ్లాండులో ఎంప్లాయిమెంటు ఎక్చేంజి ఆఫీసులు బయలుదేరవలసిన ఆగత్యం ఎందుకువస్తుంది. ఇంగ్లాండులో ఉన్న సంస్థల్లో యిదీ చాలా గొప్పదే. పట్టుమని మన మాజీ విశాఖపట్నం జిల్లా అంతలేని ఇంగ్లాండులో 1945నాటికి1200 ఎంప్లాయిమెంటు ఎక్చేంజి ఆఫీసులు ఉన్నాయంటే అక్కడ వీటి ప్రాముఖ్యం యిట్టే తెలుసుకోవచ్చు. దీనిని బట్టి ఆలిండియా కాంగ్రెసు సంస్థ ఉద్భవించడానికి మూలకారకులైన ఆంగ్లేయులే యీ అఖిలభారత నిరుద్యోగ సంఘానికి కూడా మూలకారకులన్నమాట. ఇప్పుడు అక్కడ పరిస్థితి వివరాలు మనకి పూర్తిగా తెలియదుగాని వారు నాటిన ఈ విత్తనంమాత్రం యిండియాలో బాగా పెరిగి పెద్దదయింది. అయినప్పటికీ యీ ఘనత మనకే దక్కుతోంది.

మన సంఘప్రభావం అప్పుడే మనకి కనిపిస్తోంది. మన ప్రారంభోపన్యాసం ప్రచురింపబడ్డవారం రోజులు తిరక్కుండానే హైదరాబాదు ప్రభుత్వం ఆ సంస్థానంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ఒక సంఘాన్ని నియమించదలచింది. మన ప్రారంభోపన్యాసంతోనే మనకి యింత విజయం వచ్చిందంటే మన సంఘానికి ఎంత ఉజ్వల భవిష్యత్తు ఉందో ఆలోచించండి. కాబట్టి మీరు అన్నివిధాలా సహకరిస్తారని ఆశిస్తున్నాను. వచ్చేవారం సకాలానికి హాజరుకండి. శలవు, నమస్తే.

---

కథానిక

# స్నేహితుడు చేసిన మేలు

కొమ్మూరి వేణుగోపాలరావు

"నువ్వు సహాయం చెయ్యక తప్పదురా" అన్నాడు మావాడు బ్రతిమాలుతున్నట్లు మొహం పెట్టి.

నాకుకొంచం వళ్లుమండింది. "ఏం? ఎందుచేత? లక్షణంగా పెళ్లి చేసుకోరా అని మీనాన్న అఘోరిస్తుంటే నువ్వు వద్దో దేముడా అని మొత్తుకుంటావేం? ఇవాళ కాకపోతే రేపయినా నీకు పెళ్ళిచేసుకోక తప్పుతుందా?" అన్నాను.

వాడు బిక్కమొహం పెట్టాడు. "అదికాదు. కనీసం బి. ఏ. అయినా ప్యాస్‌కాకుండా అప్పుడే పెళ్ళేమిటని?..."అన్నాడు.

"నేనుమాత్రం చదువుకోవటంలేదా?"

"అయితే?"

"అయితే ఏమిటట? నేను పెళ్ళిచేసుకోలేదూ? ఇప్పుడు నాచదువేం పాడయింది? పెళ్ళవటంతోనే చదువునాశనం కాదురా నాయనా-

బుద్ధిలోవుంది" అని చెప్పాను ఒక పెద్ద అనుభవశాలిలాగా.

"పోనీ నాకా బుద్ధిలేదను."

"ఏడిచినట్టే వుంది. అనుభవటంతోనే అయిపోయిందనుకున్నావా? నీ బుద్ధి నాకు తెలీదూ?" అన్నాను వాడిని ఉబ్బించయినా ఒప్పిద్దామని.

అయితే వాడు మరోదారి త్రొక్కాడు. "నాకు పల్లెటూరిపిల్లను చేసుకోవటం యిష్టం లేదురా" అన్నాడు.

"పల్లెటూరివాళ్లు మట్టుకు మనుషులు కారా?"

"కారని నేనన్నానా? వాళ్ల ప్రవర్తన అయోమయంగా వుంటుందని"

"వాళ్ళకూ మనకన్నా ఎక్కువ తెలివి తేటలే వున్నాయి. కాస్త చదువంటూ వెలగబెట్టగానే నీ అంతటి ఘనుడు లేడనుకుంటున్నావేమో. నాలుగురోజులు బస్తీలోవుంటే వాళ్ళూ మనకన్నా ఎక్కువ యిదిగానే వుండగలరు" అన్నాను యీసారి వాడు జవాబు యివ్వలేడనే ధీమాతో.

వాడులొంగితేనా? "ఆ అమ్మాయి అందంగా వుండవట్రా" అన్నాడు. వాడు యీవంకగనక పెట్టకపోతే మా ఎదురింట్లోవున్న విశ్వనాథం గారు మెట్రిక్యులేషన్ వెలగబెట్టిన భార్యతో ఎన్ని యిబ్బందులకు లోనవుతున్నాడో వర్ణిద్దామనుకున్నాను. కాని వాడు యింకోఎత్తు ఎత్తాడాయె.

"నువ్వు చూశావా?" అని అడిగాను.

"చూడలేదు. కాని నామనస్సుకు అలా అనిపించింది" అన్నాడు. ఈ జవాబుకింకా ఎదురు లేదు. అంతరాత్మలు మాట్లాడటం మనం ప్రత్యక్షంగా సినిమాల్లో చూస్తున్న యీరోజుల్లో మనస్సు చెప్పినమాట అబద్ధమని వాదించటానికి నేను సాహసించలేదు.

"నీకర్మం. ఇంతకీ ఇష్టంలేదని ఏడవరాదూ?" అన్నాను చివరకి యింకేమీ అనలేక. వాడు కొంటెగా చూస్తూ నవ్వాడు.

"అయితే నన్నేమి చేయమంటావు?"

"చెప్పాపుగా. ఆయన రాగానే తాపీగా కూర్చొపెట్టి మాటల్లో ఆయనకిభయం పుట్టించి చివ్వాకికి యీ పెళ్ళి తప్పిపోయేట్లు చూడాలి. వద్దని ఆయన నోటినుంచే అనిపించాలన్నమాట" అన్నాడు.

వాడూ, నేనూ ప్రాణమిత్రులం. వాడికోరిక తీర్చకుండా ఎలా వుండగలను నాకు మనస్సులో ఎంత యిష్టంగా లేకపోయినా ఊఁ అనక తప్పింది కాదు.

అసలు జరిగిన విషయమిది. ఆరోజు ఉదయం మా రామంగాడి తండ్రిదగ్గర్నుంచి ఉత్తరము వచ్చింది. వీడికోసం ఒక సంబంధం చూసినట్లు, వీడ్ని చూడటానికి కాబోయే మామగారు మేముంటున్న రూమ్‌కి యీవ్వాళ వస్తూన్నట్లు ఆయన రాశాడు. అదిచూసి తనకిప్పుడప్పుడే పెళ్లి జరగటం యిష్టంలేదని, అదెలాగయినా తప్పించమనీ నన్ను ప్రాధేయపడుతున్నాడు. అంతే.

నాకొకటి తోచింది. పోనీ నీకు పెళ్లి యిష్టం లేదని మీ నాన్నకే ఉత్తరం రాయగూడదూ?" అన్నాను.

ఇదివిని వాడు కళ్లు పెద్దవి చేశాడు. "అమ్మో యింకేమయినా వున్నదీ! ఆయన చండశాసనుడు. ఆయన మాటకు ఎదురుచెప్తే ఏంచెయ్యాలో అది చేస్తాడు" అన్నాడు ముఖంలో భయం సాధ్యమయినంతవరకూ చూపెడుతూ.

"సరేలే అయితే. ఆకార్యభారమంతా నాకు వదిలివెయ్యి" అన్నాను నేను పూచీ వహిస్తూ.

"ఏమో రామూర్తీ అంతా నీచేతిలో పెడుతున్నాను. పాలముంచినా నీటముంచినా నీదే భారం!" అన్నాడు నన్ను పొలచేద్దామని.

"ఇంకా ఆ మాటలన్నీ ఎందుకులే. నీదారి నువ్వు చూసుకో. మిగిలిన పని నేను చూసుకుంటాను" అన్నాను. వాడింకేమీ మాట్లాడలేదు.

సరిగ్గా రెండు అయేటప్పటికి వాడు బట్టలు వేసుకుని రెడీ అయ్యాడు. వాడి అవస్థ చూస్తే నాకు కొంచెం జాలికలిగింది. "జాగ్రత్త రామూర్తీ తిరుగు బండిలోనే వెళ్ళిపోయేటట్లు చెయ్యి. నీ తెలివంతా యివ్వాళ చూపెంచాలి" అంటూ మరోసారి హెచ్చరించాడు.

"అదేమీ భయంలేదుగాని అయితే ఎప్పుడు తమరు తిరిగి వేంచెయ్యటం?" అన్నాను,

"అయిమున్నరా ఆరింటికల్లా వస్తాను. మరీ పెందరాళే వస్తే ఆయనింకా కదలకపోతే?"

"అదీ నిజమేలే. అయితే అప్పటివరకూ ఎక్కడవుంటావు?"

"ఒకచోటనేముంది? ఎంతమంది స్నేహితులు లేరు మనకి? సరే అయితే యిక వెళ్తాను. ఆయన వస్తే చిక్కు"అంటూ బయటికి వెళ్ళిపోయాడు. నేనాలోచిస్తూ కుర్చీలో కూర్చుండిపోయాను.

ఆయనవస్తే ఏవిధంగా సంభాషణ ప్రారంభించాలి? ఏవిధంగా ఆయన్ను బోల్తాకొట్టించాలి? ఏవిధంగా వెళ్ళగొట్టాలి? అని ప్రకరణాలగా విభజించుకుంటూ ఉపాయం ఆలోచిస్తున్నాను. ఏదో నన్ను వాడీచిన్నకోరిక కోరాడు. నేను తెలివిగలవాడినని కూడా మాస్నేహితుల్లో ప్రతీతి. ఈ చిన్న సాయం చేసిపెట్టకపోతే మన పరువు గంగపాలయిపోదూ?

నేను ఒకమూలఆలోచిస్తూ మరోమూల రిస్టు వాచి చూసుకుంటూ కూచున్నాను. మనస్సు కాఫీకోసం ఉబలాటపడింది. ఇందాక త్రాగి వచ్చినా బావుండేది. ఇప్పుడు రూమ్ తాళం పెట్టి బయలుదేరితే? ఆయనెప్పుడు వస్తాడో ఏమో? అందుచేత కాఫీ త్రాగాలనే బుద్ధిని కూడా చంపుకుని కూర్చున్నాను.

నా రిస్టువాచిలో మూడు అయేటప్పటికి బూటు అడుగుల చప్పుడు వినిపించింది. ఎత్తి చూసేసరికి ఒక యాభయి ఏళ్లాయన గుమ్మం దగ్గర నిలబడివున్నాడు. నేను చటుక్కున కుర్చీలోంచి లేచి ఆయనను ఆహ్వానిస్తూ "రండిరండి" అన్నాను. ఆయన ఏమాత్రం సంకోచించకుండా లోపలికి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

రామం ఎవరో ఆయనకేం తెలుసు? ఒకవేళ నన్నే అనుకుంటాడేమో?

"రామారావు ఉన్నాడా అబ్బాయి?" అని అడిగాడాయన. ఆయన బుర్ర మీసాలలోంచి మాట ఎంతో మోటుగా వస్తున్నట్లు కనబడింది.

"లేడండీ?" అన్నాను మొదటనే నాగొడవ ప్రారంభించటం ఇష్టంలేక మనసులో కొంచెంగా ఏవగించుకున్నాను ఎంతయినా అల్లుడిగా చేసుకుందామన్న ఉద్దేశంతో వచ్చినవాడు. ఈ ఏకవచన సంభోదన ఏమిటి? అయినా నేను రామారావును కానని ఈయనకెలా తెలుసో! ఈ పల్లెటూరివాళ్లు కేవలం వూహాలమీద నడుస్తూ వుంటారు. అందుకనే రామం పల్లెటూరి పిల్లని చేసుకోనన్నాడు.

"నువ్వెవరివి?"

ఇది మరీ బాగుంది. పరోక్షంలో వున్న రామాన్ని గురించి అలా సంభోదించాడంటే పోనీ అనుకుందాం. ఎదురుగుండా వున్న నన్ను కూడా యిలాగేనా పిలవటం?

"నేనూ అతనూ కలసి యీరూమ్‌లో ఉంటున్నాం లెండి. ఇంతకీ తమ రెవరో తెలుసుకోవచ్చా?"అని వినయం వుట్టిపడుతూ ప్రశ్నించాను.

ఆయన నాప్రశ్నని వినిపించుకున్నట్టు లేదు. "రామం ఎక్కడికెళ్లాడంటావు? ఇందాక ఉత్తరం అందలేదూ?" అన్నాడు.

నేను వెంటనే జ్ఞాపకం వస్తున్నట్లు నటించి "ఓహో. మీరా? ఉత్తరం అందకేం? నిక్షేపంలా అందింది. అయితే అది రామంకళ్ళ బడితేనా?" అన్నాను.

ఆయన కొంచెం తెల్లబోయి "ఏం?" అని ప్రశ్నించాడు.

"పొద్దున్ననగా బయటికి పోయినవాడు ఇంతవరకూ యిటువైపు వస్తేగా అసలు. అతనికి యీ విషయాలే పట్టవు. అంతా అదోవిధమైన ప్రకృతి లెండి" అన్నాను.

ఆయన ఆశ్చర్యంతో ముందుకు వంగాడు. "అంటే? ఎలా ప్రవర్తిస్తాడు?" అని అడిగాడు.

నేను కొంచెం బెట్టు సరిచేస్తూ. "ఆ అవన్నీ చెప్పటమెందుకు లెండి? ఎంతయినా స్నేహితుడు కదా" అన్నాను.

కాని ఆయన బ్రతిమాలుతూ "అలా అనకు. ఇప్పుడు యెలా ప్రవర్తిస్తున్నదీ తెలుసుకోకపోతే రేపు అనుభవించేది ఎవరు? అయినా బుద్ధిగానే ప్రవర్తిస్తాడని విన్నాను. ఏమీ చెడుగా వినలేదే?"

"వినటానికేమి లెండి? విన్నవార్తలు అలాగే వుంటాయి. అతనితోపాటు ఆరునెలలనుంచి యిక్కడ నివసిస్తున్న నేను చెప్తున్నాగా. పూర్వం మంచిగానే వుండేవాడు. అయితేనేం యిప్పుడాతరహాయే మారిపోయింది. ఒకళ్లమాట వినడు. ఒకనీతి అంటూలేదు. ఎమిటో ఇష్టంవచ్చినట్లు చేస్తాడు."

"అంటే?"

"అంటే ఏముంది? పుస్తకం ఎన్నడూ ముట్టిన పాపాన ఎరుగడు. కాలేజీకి మహా వెళ్తే వారానికి ఒక్కరోజు వెళ్తాడేమో. ఇంకా చాలావున్నాయి లెండి" అంటూ ఆపు చేశారు.

"చెప్పు బాబూ! కాస్త పుణ్యంకట్టుకున్న వాడి వవుతావు" అంటూ ఆయనతిరిగి బ్రతిమిలాడాడు.

"కాలేజీకి యింతవరకూ జీతం కట్టలేదుకదా. ఇంటిదగ్గర్నుంచి పంపించేడబ్బంతా పైలాపచ్చీసుగా ఖర్చుపెట్టేస్తాడు. పగటిపూట ఒకసారి గదికి ఏమొస్తాడో ఏమో. రాత్రుళ్లు అసలుండడు ఇక్కడ. ఎక్కడుంటాడో ఎవరికీ తెలియదు. వారానికి అయిదుసినిమాలకిపైగా చూస్తాడు ఇక రోజుకు ఎన్ని సిగరెట్ టిన్నులు కాల్చిపారేస్తాడో లెక్కలేదు. వింటున్నారా?"

"ఆఁఆఁ చెప్పు."

"ఎంతయినా స్నేహితుడుకాబట్టి యింకా అన్నీ వివరంగా చెప్పలేకపోతున్నాను, ఎక్కడికెళ్ళావురా అంటే మాట్లాడడు. కాలేజీలో యితనిమీద బేడ్ రిమార్కు బాగాపడిపోయింది. ఈమధ్య దెబ్బలాటల్లోకి దిగాడుకూడా."

"రాత్రుళ్లు అసలు యింటికిరాడుగా." ఆయన కళ్ళలో దిగులుచూసేసరికి నవ్వొచ్చింది.

"చెప్పిందే చెప్పటమెందుకు? ఇక వానరానీయండి, పిడుగుపడనీయండి, ఏమయినా కానీయండి, బయటకుపోయి ఎక్కడెక్కడో తిరగందే వూరుకోలేదు" అన్నాను.

"అయితే స్నేహితులు బాగావున్నారేమిటి?" ఆయన కంఠస్వరంలోకూడా కొంచెం మార్పు కనిపించింది. అటువంటి మార్పు అవతరింపచేసినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను.

"స్నేహితులా? లక్షా తొంభయిమంది. అందులో ఆడస్నేహితులు ఇంకా ఎక్కువమంది. ఇంకో గంటకూచుంటే మీకే తెలుస్తుంది. ఇతని కోసం తపిస్తూ ఎంతమంది వచ్చివెడతారో?"

ఆయన కళ్ళలో దిగులుపోయి క్రమక్రమంగా ఎరుపెక్కాయి. నాకుకూడా కొంచెం భయం వేసింది.

"అయితే యింతటిప్రబుద్ధుడన్నమాట రామం? సరే యిప్పటికయినా తెలిసింది. ఇంకా పెళ్ళీ అదీ''... అంటుంటే కోపంలో ఆయనకు మాట రాలేదు.

పెళ్ళివిషయం వచ్చినందుకు సంతోషిస్తూ "ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే వాడి ప్రవర్తన బొత్తిగా మావుండలేదు. మీరు..." అని యింకేమో చెప్పబోతున్నాను. అతనికి పిల్లనిచ్చి నాశనం అవకండి అని చెపుదామని నా ఉద్దేశం.

కాని ఆయన నామాటలు వింటేగా! ప్రళయకాల రుద్రుడులాగా లేచి నిలబడ్డాడు. "ఎందుకూ అంతా అనవసరం. అసలు సంగతి తెలిసింది. నన్నే మోసగిద్దామనుకున్నాడూ?" అంటూ పెద్ద పెద్ద అడుగులువేసి బయటికి వెళ్ళిపోయాడు. వెనకనుంచి నేను పిలుస్తున్నా వినిపించుకోలేదు. ఇంకా నేను ఆయనకు మంచి మాటలుచెప్పి మెల్లిగా సాగనంపాలేమో అనుకుంటున్నాను. ఏదేమీ లేకుండా ఆయనంతట ఆయనే వెళ్ళిపోయాడు. మొత్తానికి నా ఉపాయం అమోఘంగా ఫలించింది అనుకుని మురిసిపోయాను.

ఇక వంటరిగా గడపాలి. ఎలాగ? ముందు కాఫీ తాగొద్దామనుకుని బయలుదేరాను.

నేను మాట్లాడింది స్వల్పమయినా మనసుకు హాయేలాగా మాట్లాడాను. ఇక ఆయన వీళ్ళ యింటిగుమ్మంతొక్కడు. ఇందాక వెళ్తున్నానని చెప్పకుండాకూడా వెళ్ళిపోయాడు. ఆయనకుమార్తెను యికముందు ఎవకన్నా యిద్దామని సంకల్పిస్తే లక్ష విషయాలు ఆరాతీసిగాని ఆ సంబంధము చేసుకోడు.

ఈ ఆలోచనతో కాఫీత్రాగటం పూర్తిచేసుకొని గదికివచ్చి పడుకున్నాను. ఆలోచిస్తువాడ్ని ఆలోచిస్తుట్లే నిద్రపోయాను.

చాలాసేపునిద్రపోయాను. ఎవరోతట్టుతుంటే మెలుకువవచ్చింది. బద్ధకంగా కళ్ళు నులుముకుని చూశాను. రామం కూర్చునివున్నాడు.

"ఏరా! తలుపులుతీసుకునే నిద్రపోతున్నావే ఏ దొంగైనా చొరబడితే?" అన్నాడు వాడు.

"ఏడిశాడు, పట్టపగలు ఎవడికంతసాహసం?" అంటూ లేచికూచున్నాను.

"అవునుగాని ఆయనవచ్చాడా? ఆ విషయం ఏమయింది?" అని ఆదుర్దాగా అడిగాడు వాడు.

"కంగారుపడకు. మళ్ళీ నీ పేరు తలుచుకోకుండా హడలకొట్టేశాను. ఎల్లుండీ సమయానికి

"ఈ వెళ్ళి ఆపేశామని" మీ నాన్న ఉత్తరం రాయకపోతే అడుగు' అని చెప్పాడు సగర్వంగా.

"నిజంగా?" అంటూవాడు నాబుజాలు పట్టుకొని కుదిపి పారేశాడు. ఇక జెణికే పరిస్థితిలో వుండగా "చాల్లే. ఇక తగ్గించుకో సంతోషం." అన్నాను.

"పద హోటలుకు"

నేనాశ్చర్యపోయి "యిప్పుడా? ఆరు అవ వస్తూంటేనూ?" అన్నాను.

"అవును. మనకు టైమ్‌తో నిమిత్తమేమిటి? చప్పున పదరా బాబూ" అంటూ తొందర పెట్టాడు వాడు. సరే నేనులేచి మొహం రుద్దుకున్న తర్వాత గదితాళంపెట్టి యిద్దరం బయలు దేరాం హోటల్‌కు.

మావాడు హోటల్లో ఎంతో బలవంతం చేశాడు. ఇప్పుడేంగుకంటూంటే వినకుండా స్వీట్లు తెప్పించాడు. ఇంకా ఏవేవో తినలేనన్ని పెట్టించాడు. అంతా అయింతర్వాత బయటికి వచ్చాము.

"ఇప్పుడెక్కడికి పోదాం?" అన్నాను నేను.

"సినిమాకి" అన్నాడు వాడు.

"నీపని బాగావుందే. పెళ్ళిసంబంధం పాడు చేసుకుంది చాలక పైగా సంతోషిస్తున్నావా?" అన్నా కొంచెం కోపంగా.

"ఏమయితే ఎందుకు? నాకదే సంతోషం" అన్నాడు.

ఇంకేమని సమాధానం చెప్పాలి? 'నీయిష్టం' అన్నాను.

"ఇప్పుడు డబ్బులు చాలవు. గదికిపోయి తెద్దాం" అన్నాడు. "సరే పద"మన్నాను.

తిరిగి గదికి బయలుదేరాం. దారిలో ఎన్నో కులాసాకబుర్లు చెప్పాడు. నాకేందుకో అర్థం గాలేదుగాని వాడికి సంతోషం పొంగిపోతున్నది. నేను మాట్లాడకుండా వింటున్నాను ఇద్దరంగదిని సమీపించాం. అంతవరకూ తలలు వంచుకుని నడుస్తున్నాం తప్ప తలయెత్తి ముందున్నదేమిటో చూడలేదు. చూడగానే గతుక్కుమన్నాను. ఇందాకటి ఆయన అరుగుమీదకూర్చుని వున్నాడు. రామంకూడా ఆయన్ని చూడటంతోనే ఆనుదం తాగినదాడిలా మొహంపెట్టి నావంక బెదురుతూ చూశాడు.

మమ్మల్ని చూడగానే ఆయన రౌద్రమూర్తి అయిపోయి లేచి నిలబడ్డాడు. నేను బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాను యిందాకనే కోపంవచ్చి వెళ్ళిపోయిన ఆయన తిరిగి ఎందుకు వచ్చాడో బోధపడలేదు.

"ఏరా? పెద్దవాడి వయిపోయావేమిటి? వ్యవహారం చాలావరకూ వచ్చిందే" అన్నాడాయన మండిపడుతూ.

జరుగుతున్నదేమీ నాకేం వంటు బట్టలేదు. ఎంతయినా ఏరా అంటాడేమిటి?

రామం మాట్లాడకుండా తల వంచుకుని నిలబడ్డాడు. వాడి మొహం చూస్తే వాడికికూడా ఏమీ అర్థమయినట్లు లేదు. నేను వణుకుతూ తాళంతీసి రోడ్డుమీద ఎందుకూ గొడవ? లోపలకి పదండి-అని ముందడుగు వేశాను. వెనకాలే విసవిసమంటూ ఆయనా, బిక్కుబిక్కుమంటూ రామం ప్రవేశించారు.

"నీగురించి చాలా విషయాలు తెలియ వచ్చినాయి రాత్రులు యిక్కడ పడుకోవటంగా. సిగరెట్లు అలవాటయినాయేం? ఆడవాళ్ళతో స్నేహమా? చిన్నప్పుడు ఎలా వుండేవాడివి? ఆ బుద్ధంతా పెడతల పట్టిందా?" అంటూ ఆయన అరవసాగాడు.

"నీకేవరు చెప్పారునాన్నా యీ అబద్ధాలు"

తల తిరిగింది. ఈయన రామానికి కాబోయే మామగారుకాదూ? నాన్నా? ఇందాక నేనిదంతా చెప్పింది ఎవరితో?

"అబద్ధాలా? ఆయన ఏదో పనుండి యివేళ రాలేనంటే నీతో విషయాలు మాట్లాడదామని గదిని వెతుక్కుంటూవచ్చారు నీగురించి అంతా యితనే చెప్పాడు. ఆ పళానపోయి నీ కోసం వూరంతా గాలించాను. ఉంటేగా? ఏ వెధవ కొంపలోనో వున్నట్లున్నావు. మాట్లాడవేమయ్యా?" అంటూ ఆయన నా వంక తిరిగాడు. అదే సమయానికి రామంకూడా బెదురుతున్న కళ్ళతో నావంక దీనంగా చూశాడు.

నేనేంచెప్పేది?